వివిధ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 25: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రా ములు ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ డిప్లొమా ఇన్ కలినరీ ఆర్ట్స్ రెండో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును వచ్చే నెల 2 లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రెండేళ్ల ఎంసీఏ (సీబీసీఎస్) రెండు, నాలుగో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును వచ్చే నెల 6 లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www. osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

దూరవిద్య పీజీ కోర్సుల పరీక్షా తేదీల మార్పు

ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి. రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా అందించే వివిధ పీజీ కోర్సుల పరీక్షా తేదీలను మార్చినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ మొదటి, రెండో సంవత్సరం పరీక్షలను వచ్చే నెల 13 నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

రీవాల్యూయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి. రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా అందించే ఎంసీఏ పరీక్షా ఫలితాల రీవాల్యూయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంసీఏ నాలుగో సెమిస్టర్ మెయిన్, మొదటి, రెండు, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు.

ఈ ఫలితాలపై రీవాల్యూయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి, ఈ నెల 26గా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.200 అపరాధ రుసుముతో వచ్చే నెల 5 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి వచ్చే నెల 2 లోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎల్వోసీలు అందజేత

బాధితుడికి ఎల్వోసీని అందజేస్తున్న సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్,జూలై 25 : వివిధ రుగ్మతులతో సతమతమవుతున్న పలువురికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన ఎల్వోసీలను సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ అందజేశారు. సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన అబ్దుల్ షోయాబ్ (చిలకలగూడ), వనమాల కృష్ణ (లాలాగూడ) , సంపత్ కుమార్(శ్రీనివాస్ నగర్), చంద్ర కాంత్ (సీతాఫల్‌మండి), బేబి రేశ్వంత్ (పార్సిగుట్ట)లు తమ వైద్య ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌ను సంప్రదించారు. దీంతో ఎమ్మెల్యే సీఎం సహాయనిధికి దరఖాస్తు చేయించగా పలువురికి రూ. 7 లక్షలు మంజూరయ్యాయి. వాటిని గురువారం ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ సీతాఫల్‌మండిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నేతలతో పాటు సికింద్రాబాద్ సమన్వయకర్త రాజా సుందర్ తదితరులు పాల్గొన్నారు.

బోనాలకు ఆహ్వానం

చిలకలగూడ చారిత్రాత్మక కట్టె మైసమ్మ ఆలయం బోనాల వేడుకలకు హాజరు కావాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌ను ఆలయ పాలక మండలి ప్రత్యేకంగా ఆహ్వానించింది. ఈ మేరకు ఆహ్వాన పత్రికను ఆలయ చైర్మన్ గుంటి కృష్ణ, కార్య నిర్వాహణాధికారి మహేందర్ గౌడ్ ల నేతృత్వంలోని బృందం గురువారం పద్మారావు గౌడ్‌కు సికింద్రాబాద్‌లోని టకారాబస్తీలో ఉన్న ఆయన నివాసంలో అందజేశారు. – సికింద్రాబాద్,జూలై 25

టీకాలపై అవగాహన కల్పించాలి

వ్యాక్సినేషన్ డ్రైవ్‌లో సికింద్రాబాద్ కార్పొరేటర్లు

ఉస్మానియా యూనివర్సిటీ/సికింద్రాబాద్/అడ్డగుట్ట, జూలై 25: ప్రజల్లో ప్రాథమిక టీకాల పట్ల విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని బౌద్ధనగర్ కార్పొరేటర్ కంది శైలజ అన్నారు. డివిజన్‌లోని అశోక్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో జేఈ వ్యాక్సినేషన్ డ్రైవ్‌ను ఆమె గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ వ్యాక్సినేషన్ డ్రైవ్ ద్వారా పిల్లల్లో బ్రెయిన్ ఫీవర్ వ్యాధిని అరికట్టవచ్చన్నారు. సరైన సమయంలో పిల్లలకు టీకాలు ఇప్పించడం ద్వారానే వారిని ఆరోగ్యంగా ఉంచగలుగుతామని చెప్పారు. 15 ఏండ్ల లోపు పిల్లలకు ఈ టీకాలు తప్పనిసరిగా ఇప్పించాలన్నారు. అవగాహన లోపంతో కొంతమంది వీటిని తీసుకోవడం లేదని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో యూపీహెచ్‌సీ డాక్టర్ ఎలిజబెత్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్ డ్రైవ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

పిల్లలకు వ్యాక్సిన్లు ఇప్పించాలి

జపనీస్ ఎన్సెఫలిటీస్ వైరస్ నుంచి రక్షించడానికి 9 నెలల నుంచి 15 ఏండ్ల పిల్లలకు వ్యాక్సిన్‌ను ఇప్పించాలని సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ హేమ అన్నారు.గురువారం డివిజన్ పరిధిలోని మేడిబావిలోని రెయిన్‌బో హోం , నామాలగుండులోని నెహ్రూ హైస్కూల్‌లో విద్యార్థులకు జెఈ వ్యాక్సిన్ వేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ లాస్య మాట్లాడుతూ..జేఈ వైరస్ లక్షణాలు జ్వరం, వికారం, విరేచనాలు, అలసట, మెడ దృఢత్వం, మూర్ఛ (ఫిట్స్), మొదలైనవి అని తెలిపారు.వైరస్ బారిన పడకుండా పిల్లలను రక్షించేందుకు జూలై 25 నుంచి ఆగస్టు 15 వరకు ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో టీకా వేస్తున్నట్లు తెలిపారు.

జేఈ వ్యాక్సిన్‌ను తప్పనిసరిగా వేయించాలి

అడ్డగుట్ట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన జేఈ వ్యాక్సిన్ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి పాల్గొని మాట్లాడుతూ..15 సంవత్సరాల లోపు పిల్లలకు వ్యాక్సిన్‌ను తప్పనిసరిగా వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో అడ్డగుట ఆసుపత్రి ఇన్‌చార్జ్ డాక్టర్ వీరు, స్కూల్ ఉపాధ్యాయులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మెట్టుగూడలో....

మెట్టుగూడలోని వీరమచనేని హైస్కూల్‌లో నిర్వహించిన జేఈ వ్యాక్సిన్ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ రాసూరి సునీత రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...దోమల కాటు ద్వారా వైరస్ వ్యాప్తి చెందు తున్నదని ఆమె తెలిపారు. వ్యాక్సిన్ వేసుకోవడం ద్వారా వైరస్ వ్యాప్తిని అరికట్టవచ్చున్నారు. మెడికల్ ఆఫీసర్ పవన్‌కుమార్ రెడ్డి, స్కూల్ పిన్సిపాల్ గోపికృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

అడ్డగుట్టలో జేఈ వ్యాక్సిన్ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి

మెట్టుగూడలో జేఈ వ్యాక్సిన్ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ రాసూరి సునీత

బొడ్రాయి పండుగకు ఆహ్వానం

తార్నాక డివిజన్‌లోని లాలాపేట బొడ్రాయి పండుగకు రావాల్సిందిగా స్థానిక ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మారావును గురువారం ఆయన నివాసంలో కలిసి ఆహ్వానించారు. శుక్రవారం నిర్వహించనున్న ఈ పండుగకు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొడ్రాయి కమిటీ ప్రతినిధులు వంజరి ముత్తయ్య, మురళీ యాదవ్, అనిల్‌గౌడ్, రవి, రమేశ్ గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సునీల్ ముదిరాజ్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు. – ఉస్మానియా యూనివర్సిటీ

రైలు కింద పడి వ్యక్తి మృతి

మారేడ్‌పల్లి, జూలై 25: రైలు కింద పడి గుర్తు తెలియని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఘట్‌కేసర్-బీబీనగర్ రైల్వే స్టేషన్ల మధ్య గురువారం ఉదయం 7:45 గంటలకు గుర్తు తెలియని యువకుడు తనకు తానుగా రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఆత్మహత్యకు గల వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు పేర్కొన్నారు.

విద్యార్థుల్లో మనోస్థైర్యం నింపాలి

సికింద్రాబాద్ పబ్లిక్ స్కూల్‌లో క్యారమ్ ఆడుతున్న మహావీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సెక్రటరీ ధనుంజయరెడ్డి, పాఠశాల సెక్రటరీ పి. జ్యోతి

మారేడ్‌పల్లి, జూలై 25: విద్యార్థుల్లో మనోస్థైర్యాన్ని పెంపొందించి, ప్రతిభావంతులను చేసేవి క్రీడలేనని మహావీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సెక్రటరీ ధనుంజయరెడ్డి, పాఠశాల సెక్రటరీ పి. జ్యోతి మధుసూదనరావు అన్నారు. మారేడ్‌పల్లిలోని ది సికింద్రాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 12 వ రుక్మిణీ బాయి స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో రెండు రోజుల అంతర్ పాఠశాలల (టేబుల్ టెన్నిస్, చెస్ , క్యారమ్స్, వాలీబాల్, కరాటే) క్రీడా పోటీలను గురువారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా సెక్రటరీ ధనుంజయరెడ్డి మాట్లాడుతూ...విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. విద్యార్థుల్లో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఇలాంటి క్రీడా పోటీలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. 12 ఏండ్ల నుంచి అంతర్ పాఠశాలల క్రీడా పోటీలను నిర్వహిస్తూ విద్యార్థులను క్రీడా రంగంలో ప్రోత్సహిస్తున్నామని పాఠశాల సెక్రటరీ పి. జ్యోతి మధుసూదన రావు అన్నారు. ఈ క్రీడా పోటీల్లో 100కి పైగా పాఠశాల నుంచి 1200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి నగదు బహుమతి తో పాటు, ట్రోఫీ, ప్రశంసాపత్రాలు ఇవ్వన్నునట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జాతీయ పారా టేబుల్ టెన్నిస్ ఛాంపియన్ హితేష్ డోల్ వానీ, పాఠశాల డైరెక్టర్స్ శిల్పారవి, స్వాతి, పూజ, తెలంగాణ రాష్ట్ర టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ మాజీ వైస్ ప్రెసిడెంట్, కోచ్ లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

భట్టి బడ్జెట్.. వట్టి బడ్జెట్ తుంగ బాలు

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 25: కాంగ్రెస్ మేని ఫెస్టో చూస్తే ఆకాశంలా, అమలు చూస్తే పాతాళం అన్నట్లు బడ్జెట్ చూస్తేనే అర్థమవుతోందని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు ఎద్దేవా చేశారు. భట్టి ప్రవేశపెట్టిన బడ్జెట్ వట్టి బడ్జెట్‌గా మిగిలిపోతుందన్నారు. రాష్ట్రంలోని రైతులు, మహిళలు, దళితులు, గిరిజనులు, బీసీలు, నిరుద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం మొత్తానికి మొత్తం మోసం చేసిందని మండిపడ్డారు. పాలనలోకి వస్తారో లేదో అనుకున్న కాంగ్రెస్‌కు రాష్ట్రాన్ని అభివృద్ధిలోకి తీసుకొచ్చే ప్రణాళికలు ఆశించలేమన్నారు. మొత్తం మీద బడ్జెట్ అంతా అంకెల గారడీ, సంఖ్యల పేరడీ, మాయమాటల సందడిలా ఉందని అభిప్రాయపడ్డారు.

బోనాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

అడ్డగుట్ట,బౌద్ధనగర్ కార్పొరేటర్లు లింగాని ప్రసన్నలక్ష్మి , కంది శైలజ

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మీ శ్రీనివాస్

సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ కంది శైలజ

అడ్డగుట్ట/ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 25 : బోనాల ఉత్సవాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్నిరకాల ఏర్పాట్లను పూర్తి చేయాలని అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి అన్నారు. బోనాల ఉత్సవాల నేపథ్యంలో తుకారాంగేట్‌లోని వార్డు కార్యాలయంలో గురువారం అన్నిశాఖల అధికారులతో కలిసి కార్పొరేటర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ...బోనాలతో ఆలయాలకు వచ్చే మహిళలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులకు సూచించారు. ఆలయాల వద్ద మరమ్మతు పనులను ముమ్మరం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సుభాష్‌రావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు లింగాని శ్రీనివాస్, ఏఎమ్‌హెచ్ఓ రజినీకాంత్, అన్నిశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

బోనాల పండుగను ప్రజలందరూ ప్రశాంతంగా నిర్వహించుకోవాలని బౌద్ధనగర్ కార్పొరేటర్ కంది శైలజ పిలుపునిచ్చారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో వార్డు కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుభాష్, వార్డు ఏఎంసీ ఒమెర్, ఏఎంహెచ్ ఓ రజినీకాంత్, జలమండలి ఏఈ ప్రియాంక, శానిటేషన్, ఎంటమాలజీ అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో కార్పొరేటర్ మాట్లాడుతూ బోనాల పండుగకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. బోనాలు ముగిసిన తరువాత శానిటేషన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి, ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించాలని సూచించారు.

రైల్లోంచి జారి పడి వ్యక్తి మృతి

మారేడ్‌పల్లి: అన్నదమ్ములిద్దరు తమ స్వగ్రామానికి వెళ్లాల్సిన రైలు కాకుండా పొరపాటున మరో రైలు ఎక్కి వేగంగా వెళ్తున్న రైల్లోంచి దిగే క్రమంలో తమ్ముడు ప్రమాదవ శాత్తు జారి కింద పడి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాత పాల్వంచకు చెందిన షేక్ అబ్దుల్ కరీం నగరంలో నివాసం ఉంటూ బీటెక్ చదువుతున్నాడు. తన తమ్ముడు షేక్ మహ్మద్ ఆసిఫ్ (20) చైతన్యపురిలో ఉంటూ ప్రైవేటు ఆసుపత్రిలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు.షేక్ మహ్మద్ ఆసిఫ్ జ్వరంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న అన్న తమ్ముడిని పాత పాల్వంచకు తీసుకెళ్లడానికి కాకతీయ ఎక్స్‌ప్రెస్ రైల్లో రిజర్వేషన్ చేయించాడు. ఈ నెల 24న అన్నదమ్ములిద్దరు.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో కాకతీయ ఎక్స్‌ప్రెస్ రైలు కాకుండా చెన్నై ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు. రైలు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ దాటిన తరువాత తాము ఎక్కాల్సిన రైలు ఇది కాదు అని గుర్తించిన వారు.. రైలు నుంచి షేక్ మహ్మద్ ఆసిఫ్ కిందకు దిగే క్రమంలో ప్రమాదవ శాత్తు జారి పడ్డాడు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని షేక్ మహ్మద్ ఆసిఫ్‌ను పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బడ్జెట్‌లో తెలంగాణపై కేంద్రం వివక్ష

తెలంగాణ ఉద్యమకారుల సమితి చైర్మన్ సుల్తాన్ యాదగిరి

అమరవీరుల స్థూపం వద్ద మాట్లాడుతున్న సుల్తాన్ యాదగిరి

అడ్డగుట్ట, జూలై 25 : పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందని తెలంగాణ ఉద్యమకారుల సమితి చైర్మన్ సుల్తాన్ యాదగిరి అన్నారు. బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య దోరణికి నిరసనగా గురువారం సమితి ఆధ్వర్యంలో సికింద్రాబాద్ క్లాక్‌టవర్ అమరవీరుల స్థూపం వద్ద ఉద్యమకారులు నల్లబ్యాడ్జిలను ధరించి దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ..పార్లమెంటు సాక్షిగా తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం మొండిచెయ్యి చూపెట్టినా తెలంగాణ ప్రజల ఓట్లతో గెలిచిన భాజపా ఎంపీలు బడ్జెట్‌పై స్పందించకపోవడమేంటని ఆయన ప్రశ్నించారు. బడ్జెట్ కేటాయింపులో మోడీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, తెలంగాణ భాజపా ఎంపీలు రాజీనామాలు చేస్తారో లేక కేంద్రంతో కొట్లాడి నిధులను తీసుకొస్తారో తేల్చుకోవాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఉద్యమకారులు రామి రెడ్డి, కేసీఎస్ ప్రసాద్, చంద్రుడు, కొండ స్వామి, దయానంద్, జగన్, స్వరూపరాణి, సునీత, అరుణ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

చింతల లక్ష్మీనారాయణ

అడ్డగుట్ట, జూలై 25 : ఇచ్చిన హామీని నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కార్యదర్శి చింతల లక్ష్మీనారాయణ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యకు 15 శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చి కేవలం 7.6 శాతం మాత్రమే కేటాయించడం బాధాకరమన్నారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీని సైతం కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి అమలు చేయలేకపోయిందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసేందుకు ఉపయోగపడే నిధుల కేటాయింపుల్లో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం దారుణమని ఎద్దేవా చేశారు.

శుభాకాంక్షలు : గాంధీ మెడికల్ కాలేజీ నూతన ప్రిన్సిపాల్‌గా భాధ్యతలు చేపట్టిన డాక్టర్ కే.ఇందిరను గురువారం తెలంగాణ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్, జీఎంసీ యూనిట్ అధ్యక్షుడు సారంగపాణి, కార్యదర్శి మహ్మద్ ఫారూఖ్, సభ్యులు కలిసి అభినందనలు తెలిపారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. – బన్సీలాలపేట్, జూలై 25

జాతీయ ఎడ్యుకేషన్ పాలసీ 4వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన శిక్షా సప్లాహ్ కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా వారం రోజుల పాటు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సాంస్కృతిక, సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం అడ్డగుట్టలోని ప్రభుత్వ పాఠశాలలో చిన్నారులు బోనాలు ఎత్తుకొని సంబురాలు నిర్వహించారు. అనంతరం డప్పుచప్పుళ్లతో పోతురాజుల ఆటలు, తొట్టెలను ఊరేగించారు. – అడ్డగుట్ట

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

మారేడ్‌పల్లి, జూలై 25: రైల్లో గంజాయిని తరలిస్తున్న ఓ వ్యక్తి సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మహారాష్ట్రకు చెందిన కృష్ణ బదన్ (21) కూలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇతనికి గంజాయి సేవించడం అలవాటు ఉంది. గంజాయి అమ్మితే ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చుననే ఆశతో...ఏపీలోని ఇచ్చాపురంకు వెళ్లి 16 కిలోల గంజాయిని కొనుగోలు చేసి విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో గురువారం ఉదయం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో కృష్ణ బదన్ దిగాడు. సికింద్రాబాద్ నుంచి మహారాష్ట్రకు వెళ్లేందుకు దేవగిరి ఎక్స్‌ప్రెస్ రైలు కోసం ప్లాట్ ఫారం నెంబర్ 2 లో వేచి ఉన్నాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న రైల్వే జీఆర్పీ పోలీసులు కృష్ణ బదన్‌పై అనుమానం రావడంతో అతడి బ్యాగ్‌లను తనిఖీలు చేయగా రూ.4 లక్షల 10 వేలు విలువ చేసే గంజాయి ప్యాకెట్లు లభించాయి. వెంటనే అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన నేరాన్ని అంగీకరించారు. పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

సమృద్ధిగా పంటలు: శ్రీ మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం రచ్చ శ్రీకాంత్ అమ్మవారి ఆలయం ఎదుట పచ్చికుండపై నిలబడి భవిష్యవాణి వినిపించారు.ఈ ఏడాది పాడి, పంటలు సమృద్ధిగా పండుతాయి,దేవాలయం ప్రాంగణంలో ఉన్న భూమి తిరిగి వస్తుంది,శ్రావణమాసంలో ప్రతి శుక్ర,మంగళ వారాల్లో ప్రత్యేక పూజలు చేయాలన్నారు. –బొల్లారం

ఇరువురి మధ్య వివాదం: వ్యక్తి మృతి

మారేడ్‌పల్లి, జూన్ 25: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ బోయిగూడ వైపు ఉన్న పార్కింగ్‌లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరి మధ్య నెలకొన్న వివాదంతో ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో...ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన గోపాలపురం పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ముత్తు స్వామి (25) సంవత్సరాలు...సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ 10 నెంబర్ ప్లాట్ ఫారం వైపు ఉన్న పార్కింగ్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. అదే ప్రాంతంలో మరో వ్యక్తి కూడా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా వీరిద్దరి మధ్య చిన్న చిన్న గొడవలు జరగడంతో...ఒకరి పై ఒకరు దాడికి పాల్పడడంతో...ముత్తు స్వామి తలకు బలమైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. సమాచారం అందుకున్న గోపాలపురం పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. విచారణ అనంతరం పూర్తి వివరాలను వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియపర్చునది ఏమనగా! నా క్షయింటు శ్రీ కర్రె క్రిష్ణ @ క్రిష్ణమూర్తి, తండ్రి: ఈశ్వరయ్య, వయస్సు: 54 సం.రాలు, వృత్తి: వ్యాపారం, నివాసం: ఇ.నెం. 10-2-67, గిర్మాజిపేట్, వరంగల్ సిటీ & జిల్లా, ప్రస్తుత నివాసం: ఇ.నెం. 12-11-831/16/1, ఈశ్వరీబాయి నగర్, వారీస్‌గూడా, సికింద్రాబాద్ గారి కోరిక మేరకు ఈ బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా! నా క్షయింటు తన ఇంటికి సంబంధించిన ఒరిజినల్ రిజిస్టర్డ్ సేల్ దస్తావేజు నెం. 1721/2010, తేది: 28-08-2010 ద్వారా కొనుగోలు చేసియున్నారు. అట్టి ఇంటికి సంబంధించిన 3 ఒరిజినల్ రిజిస్టర్డ్ సేల్ దస్తావేజు నెం. 1721/2010, తేది: 28-08-2010, లింక్ రిజిస్టర్డ్ గిఫ్ట్ సెటిల్‌మెంట్ దస్తావేజు నెం. 2054/2009, తేది: 31-10-2009, లింక్ రిజిస్టర్డ్ సేల్ దస్తావేజు నెం. 1145/1999, 09-07-1999, మొత్తం మూడు (3) ఒరిజినల్ రిజిస్టర్డ్ దస్తావేజులు పోయినవి. నా క్షయింటుకు సంబంధించిన మూడు (3) ఒరిజినల్ రిజిస్టర్డ్ దస్తావేజులు ఎవరికై